మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహిద్దాం

- వేడుకల నిర్వహణపై కలెక్టర్ ఖుష్బూ గుప్తా దళిత కుల సంఘాల నాయకులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** బాబు జగ్జీవన్‌రామ్, డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకల నిర్వహణకు సంబంధించి దళిత సంఘాలు, వివిధ కుల సంఘాల నాయకులతో బుధవారం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఈ సమావేశంలో పాల్గొని, ఈ మహానుభావుల జయంతి వేడుకలను ఘనంగా, గౌరవప్రదంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమాలను సమగ్రంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు నాయకుల నుండి సూచనలు, సలహాలను కోరారు.బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఏప్రిల్ 5న,డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14న నిర్వహించనున్న నేపథ్యంలో, వివిధ దళిత,కుల సంఘాల నాయకులను ఆహ్వానించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొంతమంది నాయకులు జిల్లా స్థాయిలో ఉత్సవ కమిట్టీ ఏర్పాటు చేయాలని కోరగా, కలెక్టర్ ఈ అంశాన్ని పరిశీలించి, ఇలాంటి కమిటీలు ఏర్పాటు చేసిన ఇతర జిల్లాలకలెక్టర్లతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.సమావేశంలో కుల సంఘాల నాయకులు వారి సలహాలు సూచనలు ఇస్తూ, ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని ఎండనుండి, వాననుండి కాపాడేందుకు గొడుగు ఆకారపు షెడ్ నిర్మించాలని, విగ్రహానికి పూలమాలలు వేసేందుకు సౌకర్యవంతమైన మెట్లు ఏర్పాటు చేయాలని నాయకులు సూచించారు. గతంలో కొన్ని సందర్భాల్లో జయంతి వేడుకలకు అధికారులు హాజరుకాలేదని ప్రస్తావిస్తూ, అన్ని సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. అదనంగా, అంటరానితన నిర్మూలనకు సామాజిక ఐక్యతను పెంపొందించేందుకు జిల్లా పరిధిలోని ఒక గ్రామం లేదా కాలనీలో సహపంక్తి భోజనం నిర్వహించాలని ప్రతిపాదించారు. -మిగతా4లో..

# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

- స్కానింగ్ సెంటర్లలో రేట్ల పట్టిక తప్పనిసరి
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, హాజరైన జిల్లా వైద్య అధికారులు

**వనపర్తి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, స్కానింగ్ కేంద్రాలు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 ప్రకారం రేట్ చార్టులను ప్రదర్శించడంతో పాటు, నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.బుధవారం మధ్యాహ్నం ఐడిఒసి కాన్ఫరెన్స్ హాల్లో ప్రయివేట్ హాస్పిటల్ రిజిస్ట్రేషన్ జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించి,పలు దరఖాస్తులను సమీక్షించారు.3ఆసుపత్రులు,3 క్లినిక్‌లు, 1 దయాగ్నొస్టిక్ సెంటర్, 4 స్కానింగ్ కేంద్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకోగా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ పరిశీలన చేసింది. కొత్తగా ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్న కిరణ్ గ్యాస్ ట్రోల్ లివర్ ఎండోస్కోపీ సెంటర్ క్లినిక్, డా.మనిషారెడ్డి పాలి క్లినిక్, గాయత్రి డెంటల్ క్లినిక్ లకు ఆమోదం తెలిపింది. అదేవిధంగా కొత్త హాస్పిటల్ కోసం దరఖాస్తు చేసుకున్న రవీంద్రబాబు హాస్పిటల్, హైందవ్ న్యూరో హాస్పిటల్, ఆర్య హాస్పిటల్‌కి కమిటీ ఆమోదం తెలిపింది. వీటితోపాటు ఒక దయాగ్నస్టిక్ సెంటర్, నాలుగు (2 కొత్తవి +2 రెన్యువల్) స్కానింగ్ కేంద్రాలకు కూడా కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రులు -మిగతా4లో..

# కుటుంబ వ్యవస్థ కనుమరుగు

- మనుషుల మధ్య ద్వేషం పెరిగి అనుబంధాలు దూరం
- ఎక్సైజ్ టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు

**చిన్నంబావి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** మానవుడు ఆధునిక యుగంలో నింగికి శాటిలైట్లు పంపుతున్నప్పటికీ, మనిషి కుటుంబ బంధాలను కాపాడుకోవడంలో వెనుకబడిపోతున్నాడని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం కొల్లాపూర్ నియోజకవర్గంలోని దగడపల్లి, అమ్మాయిపల్లి గ్రామస్థులతో ముచ్చటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న అంతరాలు, రైతు సమస్యలు, యువత పెడ ధోరణి, ఆత్మహత్యలపై ఆందోళన వ్యక్తంచేశారు.నాడు తండ్రి మాట కోసం,తమ్ముడు భరతుని క్షేమం కోసం శ్రీరాముడు సంతోషంగా అడవుల బాట పట్టాడని, కుటుంబ గౌరవం కోసం త్యాగాలకు వెనుకాడని గొప్ప సంస్కృతి మనదని మంత్రి గుర్తు చేశారు. కానీ నేడు.. ఆత్మీయ అనుబంధాలు కనుమరుగవుతున్నాయని, ప్రేమానురాగాల కంటే సంపాదనపై మోజు పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ఆస్తి కోసం, స్వల్ప -మిగతా4లో..


గ్రామస్తులతో ముచ్చటిస్తున్న మంత్రి జూపల్లి

# జబర్దస్త్ ఫేమ్ కొమురక్కపై దాడి


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కొమరయ్య

**బాలానగర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** బాలానగర్ మండల పరిధిలోని ఉడిత్యాల గ్రామంలో బుధవారం రాత్రి టీవీ ఆర్టిస్ట్,జబర్దస్త్ ఫేమ్ కొమురక్కపై దాడి ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు 8 మందిపై కేసు నమోదు చేశారు.ఎస్సై లెనిన్ వివరాల ప్రకారం కొమురయ్య అలియాస్ కొమురక్క తన ఇంట్లో ఉండగా కాశిరెడ్డి గూడ గ్రామానికి చెందిన వంశీకృష్ణ, వికాస్, చంద్రశేఖర్,గోవాశివ,రామ్‌చరణ్, నరేష్, పోతుల శివ, కిషోర్ కొమురయ్య ఇంటి వద్దకు వచ్చి మేము మీ అభిమానులం” అంటూ మాట్లాడారు. -మిగతా4లో..

# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత రానివ్వొద్దు

- గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్


నిర్మాణములో ఉన్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్


హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

**గద్వాల ఏప్రిల్1,ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ అలంపూర్ తహసిల్దార్ కార్యాలయంలో పలువురు అధికారులతో సమావేశమై మాట్లాడారు.ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు అధిక ధరలు చెల్లించి ప్రైవేట్ వ్యక్తులనుంచి ఇసుకకొనుగోలు చేయవద్దని, ప్రభుత్వం నుంచి నిబంధనల ప్రకారం కొనుగోలు చేసేలా సంబంధిత అధికారులు లబ్ధిదారులకు సహకరించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం కావాలని, ప్రభుత్వ లక్ష్యం మేరకు నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. సెన్సస్‌పై ఇప్పటికే జిల్లాలో కార్యకలాపాలు మొదలయ్యాయని,సంబంధిత అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తహసిల్దార్ కార్యాలయంలో రికార్డు గది, ఇతర పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం అలంపూర్ మున్సిపల్ కార్మికులు తమకు పెండింగ్ లో ఉన్న జీతాలను ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ అలంపూర్‌లోని నిర్మాణంలో ఉన్నపలు ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు.హెల్త్ సెంటర్ లో ఆకస్మిక తనిఖీ.. అనంతరం కలెక్టర్ అలంపూర్ లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.వార్డులో తిరుగుతూపలువురు రోగులు, సహాయకులతో మాట్లాడారు. ఫార్మసీ,ఎక్స్రే, డయాలసిస్‌యూనిట్, తదితర విభాగాలను పరిశీలించారు. హాజరు రిజిస్టర్‌తో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ఓపిల సంఖ్య పెరగాలని, సబ్ సెంటర్స్ నుంచి రోగులను రెఫర్ చేయాల్సివస్తే ప్రభుత్వ ఆసుపత్రులకే పంపించేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. టాయిలెట్స్‌ను శుభ్రంగా ఉంచాలని, ఆసుపత్రిలో అనవసరమైన ఫర్నిచర్ తొలగించాలని ఆదేశించారు.అలంపూర్ ఆలయాలను సందర్శించిన కలెక్టర్..అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అలంపూర్ ఆలయాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి దీప్తి, ఇతర అధికారులు -మిగతా4లో..

# మంత్రుల పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు

- ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టిపెట్టాలి
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చం పేట నియోజకవర్గంలోని మద్దిమడుగు గ్రామంలో గురువారం రాష్ట్ర మంత్రుల పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రుల పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖలు గురువారం జిల్లాలో పర్యటించనున్నారు.ఈ సందర్భంగా అచ్చంపేట నియోజ కవర్గ పరిధిలోని పదర మండలం మద్దిమడుగు గ్రామాన్ని సందర్శించనున్నారు. మంత్రులు ముందుగా ప్రసిద్ధ మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం అక్కడే అధికారులు,ప్రజాప్రతినిధులతో సమావేశమై ప్రాంత అభివృద్ధి కార్యక్రమాలు, కొనసాగుతున్న పనులు, భవిష్యత్ ప్రణాళికలపై సమీక్ష నిర్వహించనున్నారు .ప్రజల సమస్యలు,అవసరాలపై కూడా చర్చించనున్నట్లు సమాచారం. పర్యటన షెడ్యూల్ ప్రకారం మంత్రులు ఉదయం హైదరాబాద్‌లోని నివాసం నుండి బయలుదేరి బేగంపేట్ విమానాశ్రయం చేరుకుని, అక్కడి నుండి హెలికాప్టర్ ద్వారా మద్దిమడుగు గ్రామానికి చేరుకోనున్నారు. -మిగతా4లో..

# కొత్తగా రెండు లక్షల పింఛన్లు

- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర,ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని పేదలు, వృద్ధులు, అభాగ్యులకు, తీపి కబురు అందించిందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026, 27 వార్షిక బడ్జెట్ ప్రసంగంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేసి, రెండు లక్షలమందికి చేయూత పింఛన్లను ఇవ్వబోతుందన్నారు.గత కొంత కాలంగా ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారులకు ఈనిర్ణయంతో ఊరటలభించిందన్నారు. సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభు త్వం అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సామా న్యుడికి లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా నిధులు కేటాయింపు జరిగాయని వివరిం చారు. ఇప్పటికే పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అధి కారులు, వార్డ్‌స్థాయిలో పరిశీలిస్తున్నట్లు తెలిపారు.అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి కొత్త పెన్షన్లు ఇవ్వబోతున్నామనిఎమ్మెల్యే అన్నారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిరుపేదల కళ్ళల్లో ఆనందం చూడాలని తపిస్తుందని,ఈ అద నపు పింఛన్ల మంజూరుతో లక్షలాది కుటుంబాలలో కొత్త వెలుగులు నిండుతాయని తాము ఆశిస్తున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తెలిపారు. సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తూ, అర్హులందరికీ న్యాయం చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- రెండేళ్లలో 12,082 మంది లబ్ధిదారులకు రూ.71కోట్ల విలువ గల చెక్కుల పంపిణీ
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్1, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్మని నిరుపేదలకు ఉపయోగపడే ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నేడు గడపగడపకు సంక్షేమ ఫలాలు అందేలా చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వనపర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన, సిఎంఆర్ ఎఫ్, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఇప్పటివరకు 15 విడతలలో చెక్కుల పంపిణీ చేపట్టా మన్నారు. ఇందుకుగాను ఇప్పటివరకు 15 విడతల్లో 6883 మంది సిఎం ఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ. 163030600 కోట్ల రూపాయలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.ఆసుపత్రులలో మెరుగైన చికిత్స అందించడం కోసం నేటి వరకు 339 మంది బాధితులకు రూ.6కోట్ల 47 లక్షల రూపాయలను ఆపత్కాలంలో మెరుగైన వైద్యం కోసం అందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన శ్రీశైలం, నాగార్జున సాగర్, కోయిల్‌సాగర్,జూరాల నెట్టెంపాడు,లాంటి అనేకరిజర్వాయర్ల ద్వారా నేడు ఆయకట్టుకు సాగునీరు అందుతుందని వివరిం చారు.మేమే నీళ్లు తెచ్చామని చెప్పే నాయకులు వనపర్తి నియోజకవర్గానికి నీళ్లు అందించిన ఒక్క ప్రాజెక్టును ఎక్కడ నిర్మించారో చూపించాలని ఆయన ప్రశ్నించారు.మేఘన ఆభయాసం పేరున మృతి చెందిన కుటుం బాలకు 5000 ఆర్థిక సహాయం అందజేస్తుంటే చూడలేని కొందరు దానిని కూడా రాజకీయం చేయడం సిగ్గుమాలిన తనమని ఆయన మండిపడ్డారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని దివాలా తీయించి ధ్వంసం చేశారని నేడు రాష్ట్రాన్ని చక్కదిద్దడంలో 18 గంటలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రమిస్తున్నారన్నారు.గతంలోని కొందరు నాయకులు పక్క వాళ్ళు చేసిన పనులకు రంగులేసి తామేదో ఉద్ధరించినట్లు ఫోటోలకు ఫోజులు ఇవ్వడం సిగ్గుచేటని అన్నారు.అనంతరం లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, CMRF లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్‌గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ వనపర్తి మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, పట్టణ కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచు, మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ బెంగళూరు డిఫెన్స్ కారిడార్ ఏర్పాటు చేయండి

- బ్రహ్మోస్, “ఇంటిగ్రేటెడ్ వెపన్ సిస్టమ్ కాంప్లెక్స్” పనులు వేగవంతం చేయండి
- కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శిని కోరిన ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ.జితేందర్ రెడ్డి


కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శిని కలిసిన ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ.జితేందర్ రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా. మల్లు రవి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ.జితేందర్ రెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా. మల్లు రవితో పాటు కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్‌తో ఆయన కార్యాలయంలో సమావేశమయ్యారు. దేశ రక్షణ రంగ ప్రగతికి దోహదపడేలా హైదరాబాద్ బెంగుళూరు మధ్య డిఫెన్స్ కారిడార్ ఏర్పాటు చేయాలని గతంలోనే ప్రధాని మోదీకి, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఆ నేపథ్యంలో ఈ కారిడార్ రక్షణ రంగంలో ఆత్మనిర్భర భారత్ (స్వదేశీ తయారీ) లక్ష్యాన్ని సాధించడం తో సహా భారీ పెట్టుబడులను ఆకర్షిస్తుందని,ఈ కారిడార్ హైదరాబాద్‌లోని డిఫెన్స్ హబ్‌లను మరియు బెంగళూరులోని ఏరో స్పేస్ యూనిట్లను కలుపుతూ, ఒక సమగ్ర పారిశ్రామిక జోన్‌గా అభివృద్ధి చెందుతుందని వారు రక్షణ శాఖ కార్యదర్శికి వివరించారు. ఈ అంశాలను దృష్టిలో వుంచుకొని బెంగళూరుహైదరాబాద్ డిఫెన్స్ ఏరో స్పేస్ కారిడార్ ను ఏర్పాటు చేసే అంశాన్ని పరశీలించాలని కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్‌ను జితేందర్ రెడ్డి, మల్లు రవి లు కోరారు. అదే విధంగా మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో రక్షణ పరిశోధన సంస్థ(డీఆర్‌డీఎల్) సంస్థ నిర్మించ తలపెట్టిన “బ్రహ్మోస్“ వంటి పలు క్షిపణులను తయారీ చేసే “ఇంటిగ్రేటెడ్ వెపన్ సిస్టమ్ కాంప్లెక్స్“కు అవసరమైన స్థలాన్ని రాష్ట్ర ప్రభు త్వం ఇప్పటికే కేటాయించిన నేపథ్యంలో వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి కాంప్లెక్స్‌ను పూర్తి చేయాలని ఈ సందర్భంగా రాజేశ్ కుమార్ సింగ్‌ను ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వీరితో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, ప్రాయోజిత పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ కూడా ఉన్నారు.


దేవరకద్ర మార్కెట్‌కు వచ్చిన ఉల్లి

# ఉల్లి రైతుకు నిరాశ..

**దేవరకద్ర, ఏప్రిల్1 ప్రభాతవార్త:** ఈసారైనా మంచి ధర వస్తుందనుకొని ఉల్లిపంటను మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతన్నకు నిరాశే మిగిలింది. గతేడాది డిసెంబర్‌లో ఉల్లి ధరలు బాగా పెరిగిన సమయంలో రైతు వద్ద దిగుబడులు లేని పరిస్థితి ఉండేది.ఇప్పుడు ఉల్లి దిగుబడులు పెద్ద ఎత్తున వచ్చినప్పటికీ ధరలు మాత్రం పెరగడంలేదు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ఉల్లికి పెట్టిన పెట్టుబడులు రాక ఉల్లి రైతులు నిరాశ చెందుతున్నారు. దేవరకద్ర మండలంతో పాటు వివిధ గ్రామాలలోని రైతులు పండించిన ఉల్లిగడ్డను విక్రయించేందుకు తీసుకు రావడంతో పెట్టినపెట్టుబడులు రాక ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లో జరిగిన వేలంలోగరిష్టంగా 1400,కనిష్టంగా 800, ధర పలికింది. రైతులు ఎంతో కష్టపడి పెట్టినపెట్టుబడులు రాక నిలిచిన ఉల్లికి మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. జరిగిన వేలంలో దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ యార్డ్‌కు ఉల్లిగడ్డ 500 క్వింటాలు అమ్మకానికి వచ్చినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

# చిన్నారిని హత్య చేసిన గుర్తుతెలియని దుండగులు


మృతి చెందిన చిన్నారి తేజశ్రీ


తేజశ్రీ (ఫైల్)

**నారాయణపేట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది అభంశుభం తెలియని చిన్నారి తేజశ్రీని గుర్తు తెలియని దుండగులు దారుణంగా హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది. నారాయణపేట మండలం అమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంజి,శిరీష దంపతులు ఉపాధి కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లగా,వారి చిన్న కూతురు తేజశ్రీని గ్రామంలో అవ్వ తాతల వద్ద ఉంచి వెళ్లారు. ఎప్పటిలాగే రాత్రి అవ్వతాతలతో కలిసి ఇంటి ముందు ఆరుబయట నిద్రించిన తేజశ్రీ, అర్ధరాత్రి అనుమానాస్పద పరిస్థితుల్లో కనిపించకుండా పోయింది. ఈ ఉదయం గ్రామ సమీపంలోని చెరువు కట్టపై చిన్నారి శవంగా కనిపించడం గ్రామాన్ని కలచివేసింది. చిన్నారి వద్ద ఉన్న కాళ్ల పట్టీలు, చెవి దుద్దుల కోసం హత్య చేశారా? లేక మరేదైనా కారణం ఉందా? అన్నది ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనపై సమాచారం అందుకున్న నారాయణపేట రూరల్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. పోలీసు జాగిలాల సహాయంతో ఆధారాల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చిన్నారి హత్యతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## సొంతింటి కల సాకారం

## కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం : ఎమ్మెల్యే

**రాజాపూర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** నిరుపేదలకు సొంతింటి కల సహకారం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యపడుతుందని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. బుధవారం రాజాపూర్ మండలంలోని రంగారెడ్డి గూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును అనిరుద్‌రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని, ప్రతి అర్హులైన కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడం లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి ఒక పెద్ద ఆస్తి అని, ఇలాంటి పథకాల ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేవతి ఆనంద్, ఉప సర్పంచ్ యాదగిరి, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

## సభలు ర్యాలీలు నిషేధం ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**ఏప్రిల్ 1 నుంచి 30 వరకు "30 పోలీస్ యాక్ట్" అమలు**

**ముందస్తు అనుమతి లేకుండా**

**ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధం**

**ప్రజల సహకారంతోనే శాంతి భద్రతలు సాధ్యం ఎస్పీ**

**వనపర్తి,ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** జిల్లాలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడం, ప్రజల సాధారణ జీవనాన్ని నిరంతరాయంగా కొనసాగించడం, అనవసర గుమికూడింపులు నివారించడం లక్ష్యంగా ఏప్రిల్ 01 నుంచి ఏప్రిల్ 30 వరకు 30 పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పరిధిలో ప్రజా జీవనాన్ని అంతరాయం కలిగించే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎవరైనా పోలీ సు ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, భారీ స్థాయి సమావేశాలు నిర్వహించడం కఠి నంగా నిషేధం. ప్రజా జీవనానికి అంతరాయం కలిగించే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యకైనా చోటులేదు" అని స్పష్టం చేశారు. అలాగే "30 పోలీస్ యాక్ట్" ఉల్లంఘనలకు చట్టం లో స్పష్టమైన శిక్షలు ఉన్నాయి. అనుమతి లేకుండా కార్యక్రమాలు చేపట్టిన వారిపై ఎటువంటి మినహాయింపు లేకుండా చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ప్రజల భద్రత కోసం పెట్టబడ్డాయి. అందరూ తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ఏ కార్యక్రమం కావాలన్నా ముందుగానే దరఖాస్తు చేసి అనుమతి పొందండి. ప్రజల సహకారం వల్లనే శాంతిభద్రతలు నిలుస్తాయి. పోలీసుల చర్యలు ప్రజల రక్షణ కోసమేనని ఎస్పీ తెలిపారు.


జిల్లా ఎస్పీ సునీత రెడ్డి (ఫైల్)

## పేద ప్రజలకు అండగా కళ్యాణ లక్ష్మి

**సీఎం రేవంత్ రెడ్డికి, దేవరకద్ర ఎమ్మెల్యే కు ప్రత్యేక కృతజ్ఞతలు**

**దేవరకద్ర, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** పేదింటి ఆడపడుచులకు అండగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఉన్నదని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, సీఎంఆంఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడబిడ్డలకు భరోసాగా పెళ్లిళ్లు చేసుకున్న పేద కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీకి అదనంగా సీఎంఆర్ఎఫ్ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందిన నిరుపేదలకు ముఖ్య మంత్రి సహాయనిధి ఒక వరమని ఆయన కొనియాడారు. అలాగే రాజకీయాలకు అతీతంగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకే చెక్కులు అందజేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, సర్పంచ్ నరేష్ కుమార్ ,ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, తహసిల్దారు సుందర్ రాజ్, ఎంపీడీవోలు శివప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కౌకుంట్ల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కౌకుంట్ల మండల కాంగ్రెస్ నాయకులు

## గ్రంథాలయం పాఠకులకు సౌకర్యాలు కల్పిస్తాం

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి**

**దేవరకద్ర,ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి బుధవారం దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పాఠకులకు కావలసిన అన్ని సౌకర్యాలను కల్పిస్తామన్నారు. పాఠకులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగుల కోసం పోటీ పరీక్షల బుక్స్, గ్రం థాలయ పరిస్థితులను, రికార్డులను, పరిశీ లించారు. పాఠకులకు కావలసిన వసతు లు, పుస్తకాలు అందుబాటులో ఉండేటట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రంథాలయ భవనం యొక్క కిటికీలకు ఏర్పాటు చేసిన అద్దాలు పగిలిపోయి ఉండడం, బయటి నుండి దుమ్ము, ధూళి లోపలికి వస్తున్న పరిస్థితిని ఆరా తీశారు. వెంటనే మరమ్మతులు చేయించి వాటిని వీలైనంత త్వరగా ఏర్పాటు చేయవలసిందిగా అధికారులకు ఆదేశించారు. వారి వెంట జిల్లా కార్యాలయపు సిబ్బంది శ్యాంసుందర్, లైబ్రేరియన్ సయ్యద్ మోహినుద్దీన్, జూనియర్ అసిస్టెంట్ రమ్య, లైబ్రేరియన్, తదితరులు పాల్గొన్నారు.


జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించిన మల్లు నరసింహారెడ్డి

## ఘనంగా శ్రీకోట్ల ఆంజనేయస్వామి జయంతి

**మద్దూరు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** మద్దూరు పట్టణంలో శ్రీ కోట్ల ఆంజనేయస్వామి జయంతి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పట్టణం నలు మూలల నుండి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు. అనంతరం జల్దీ కార్యక్రమం నిర్వహించి, పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భక్తుల ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జై శ్రీరాం", జై హనుమాన్" నినాదాలతో పట్టణం మారుమోగింది. ఆలయ ప్రాంగణంలో అన్నదాత భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులకు భోజన సదుపాయం కల్పించారు. భక్తులు భక్తి భావంతో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, యువకులు, భక్తులు చురుకుగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.


జల్లి బిందె కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు


ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

## రైతుల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం

**గద్వాల ఏప్రిల్ 01, ప్రభాతవార్త :** రైతుల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ముఖ్య ధ్యేయమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం రాయితీ పై యంత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యతిథులుగా హాజరయ్యారు. గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో గట్టు మండలం,గద్వాల్ మండలం వ్యవసాయ యాంత్రీకరణ పథకం రాయితీ పై యంత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్భహించారు.గట్టు మండలంలోని 14 మందికి, గద్వాల మండలం 2 మందికి అర్హులైన లబ్ధిదారులకు 16 మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా వ్యవసాయం యంత్రాలను పంపిణీ చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ...దేశానికి అన్నం పెట్టేవాడు రైతు అని,వ్యవసాయ రంగంలో ప్రస్తుతం టెక్నాలజీకి సంబంధించిన యంత్రాలను ఉపయోగించి రైతులు వ్యవసాయం చేయడం జరుగుతుందన్నారు. వారికి ప్రభుత్వం తరఫున సబ్సిడీ లో వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా అర్హులైన రైతులకు సబ్సిడీ ద్వారా వివిధ రకాల వ్యవసాయ యంత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అనేకమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రైతుల అభ్యున్నత కు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.భవిష్యత్తులో వ్యవసాయ రంగంలో రైతులు తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిచే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్,వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ హనుమంతు,జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడు, జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, సర్పంచులు శివ, పవన్ రెడ్డి, విజయుడు, నాయకులు ఉరుకుందు, రామయ్య శెట్టి, యుగేందర్ గౌడ్, గోవిందు, శేఖర్ రెడ్డి తిమ్మారెడ్డి, శేఖర్ రెడ్డి, సిల్వర్ రోటవేటర్ డిస్ట్రిబ్యూటర్ దేవేందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.


వ్యవసాయ యంత్రాలను పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే

## లేబర్ కోడ్లు రద్దు చేసే వరకు ఉద్యమాలు ఉధృతం...

### ఆత్మకూరులో నిరసన కార్యక్రమాలు...

**ఆత్మకూర్ ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం కార్మికుల పాలిట శాపంగా రూపొందించినటువంటి నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు ఉద్యమాలను ఉధృతం చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు సిపిఎం అనుబంధ సంఘమైన సిఐటియు జిల్లా అధ్యక్షులు రాజు తదితరులు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం రోజు సిపిఐ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించగా సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మికులు పోరాడి సాధించుకున్నటువంటి 29 కార్మిక చట్టాలను రద్దు పరచడమే కాకుండా కార్పొరేట్ రంగాలకు మేలు చేసే విధంగా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కేవలం నాలుగు లేబర్ కోడ్లను తయారుచేసి కార్మికుల పాలిట మరణశాసనం రాస్తుందని వారు తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఓవైపు రోజుకు ఎనిమిది గంటలకన్నా మించి పనిచేయకూడదని కార్మిక శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం రూపొందించినటువంటి కొత్త చట్టాల ఆధారంగా 12 గంటల వరకు కార్మికుల శ్రమించాల్సి వస్తుందని ఈ విషయాన్ని దేశభక్తితంగా అన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ కేవలం బిజెపి అనుబంధ సంఘమైన బిఎంఎస్ మాత్రమే సమర్థించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్లను రద్దుచేసి దేశవ్యాప్తంగా కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించే విధంగా చట్టం రూపొందించాలని లేనిపక్షంలో దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని వారు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు శ్రీహరి, లక్ష్మీనారాయణ శెట్టి, భరత్, సిపిఎం నాయకులు, రాజు వెంకటేష్ తదితరులతో పాటుగా మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ మరియు పురపాలక సంఘ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


గాంధీ చౌరస్తాలో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన నిర్వహిస్తున్న దృశ్యం



సిఐటియు ఆధ్వర్యంలో నిరసన నిర్వహిస్తున్న దృశ్యం

## ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు

**దేవరకద్ర ,ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** తెలంగాణ న్యాయవాదుల రక్షణ చట్టం 2026 ను అసెంబ్లీలో ఆమోదించడం పట్ల దేవరకద్ర నియోజకవర్గ ప్రజలు నాయకులు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ... ఎన్నో సంవత్సరాలుగా న్యాయవాదుల సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు ఈ చట్టం ఒక కీలక పరిష్కారంగా నిలుస్తుందని పేర్కొన్నారు. గతంలో న్యాయవాదులపై జరిగిన దాడులు, వేధింపులు, పెరుగుతున్న నైపథ్యంలో వారి భద్రత కోసం ప్రత్యేక చట్టం అవసరం ఎంతో కాలంగా ఉందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అత్యంత అభినందనీయమని తెలిపారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత న్యాయవాదుల గౌరవం, భద్రత మరింత బలపడటమే కాకుండా న్యాయవ్యవస్థ పై ప్రజల నమ్మకం పెరుగుతుందని తెలిపారు. న్యాయవాదులు తమ విధులను భయపడకుండా స్వేచ్ఛగా నిర్వర్తించేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉండి, న్యాయవాదుల సమస్యలను లోతుగా అర్థం చేసుకొని, అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టివ్, వెల్ఫేర్ డ్రాఫ్ట్ ను ఎంతో కష్టపడి స్వయంగా సిద్ధం చేసి, ముఖ్యమంత్రిని ఒప్పించి ఈ చట్టం అమల్లోకి తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి, రాష్ట్ర న్యాయవాదులందరి తరపున మరియు దేవరకద్ర నియోజకవర్గ న్యాయవాదులు, ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.


సీఎం రేవంత్ రెడ్డికి దేవరకద్ర ఎమ్మెల్యేలకు క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు, నాయకులు

## ఘనంగా గీతం స్కూల్ వార్షికోత్సవం నిర్వహణ

**దామరగిద్ద,ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల కేంద్రంలోని గీతం పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ కనికి రెడ్డి, ఉప సర్పంచ్ సత్తి సత్యనారాయణ, వై. నారాయణ రెడ్డి, యాదయ్య శెట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో కూడా ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చదువులో ప్రతిభ కనబరిచి గురుకుల పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి వారికి స్మారక చిహ్నాలు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో సాగి ఆనందోత్సాహాల మధ్య ముగిసింది.ఈ వేడుకలను పాఠశాల ప్రిన్సిపాల్ పల్లవి, కరస్పాండెంట్ విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


గీతం పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కనికి రెడ్డి

## శ్రీ గురులోక మసంద్ మహారాజ్ జాతరకు రాష్ట్ర పండుగ హోదా

**ముఖ్యమంత్రికి ధన్యవాదాలు**

**శతాబ్దాల చరిత్ర గల జాతరకు రాష్ట్ర పండుగ గుర్తింపు**

**బంజారా కోరిక నెరవేర్చిన ప్రభుత్వం**

**మద్దూరు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీ గురు లోకామసంద్ మహారాజ్ జాతరకు రాష్ట్ర పండుగగా గుర్తింపు ఇవ్వడం పట్ల ఆలయ దేవస్థాన కమిటీ, పూజారులు, దేవదాయ శాఖ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. నారాయణపేట జిల్లా, కొత్తపల్లి మండలం, తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ గురు లోకామసంద్ బావోజి మందిరం శతాబ్దాల చరిత్ర కలిగిన పవిత్ర క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. 17వ శతాబ్దంలో గురు లోకామసంద్ మహారాజ్ ఈ ప్రదేశంలో జీవ సమాధి పొందినట్లు విశ్వసిస్తారు. అప్పటి నుండి దేశంలోని కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల నుండి లక్షలాది మంది భక్తులు, ముఖ్యంగా బంజారా సమాజానికి చెందిన వారు, ఈ క్షేత్రాన్ని దర్శించుకుంటూ వస్తున్నారు.ఈ దివ్యక్షేత్రానికి రాష్ట్ర పండుగ హోదా కల్పించడం ద్వారా బంజారా జాతి చిరకాల కోరిక నెరవేరిందని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా యావత్ బంజారా సమాజం ముఖ్యమంత్రి కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.


గురులోక మసంద్ ఆలయం ( బావాజీ)

## తిమ్మాజి పల్లి గ్రామ అభివృద్ధిలో మరొక ముందడుగు

**రూ.5 లక్షల సిసి రోడ్డుకు భూమి పూజ**

**పాల్గొన్న సర్పంచ్ నాగేష్ యాదవ్**


సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్

**వడ్డేపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** వడ్డేపల్లి మండలం ఏఐసీసీ కార్యదర్శి సంపత్ అన్న సహకారంతో తిమ్మాజి పల్లి గ్రామం ఒకటో వార్డులో డా. కృష్ణ ఇంటి నుంచి కురువ నరసింహులు ఇంటి వరకు సిసి రోడ్డు పనులు సర్పంచ్ నాగేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బీసన్న, గౌనింటి వీరేష్, వార్డు మెంబర్లు, వెంకన్న, కుమ్మరి నర్సింలు, గోవిందు, గ్రామస్తులు మద్దిలేటి, చక్రవర్తి, జయరాముడు, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో ఉచిత ప్రకృతి వైద్య చికిత్స

**ఆత్మకూర్ ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో ఈనెల 4వ తేదీ నుండి ఐదు రోజుల పాటు ఆర్యవైశ్య సంఘ అఫీషియల్స్ ఆధ్వర్యంలో ఉచిత ప్రకృతి వైద్య చికిత్స నిర్వహించినట్లుగా ఆ సంఘం ఆత్మకూరు అధ్యక్షులు తాళ్లపల్లి నాగరాజు ప్రధాన కార్యదర్శి సూరంపల్లి సిద్దేశ్వర్ కార్యదర్శి సూరంపల్లి రమేష్ తదితరులు ప్రభాత వార్తకు తెలిపారు. ఉచిత ప్రకృతి వైద్య చికిత్స నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆత్మకూర్చుటపక్కల ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాలుగవ తేదీ నుండి 9వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఎలాంటి శాస్త్ర చికిత్సలు అవసరం లేకుండానే దీర్ఘకాలిక వ్యాధులతో పాటుగా తాత్కాలిక రోగులకు కూడా ఉచిత వైద్య చికిత్స అందించనున్నట్లుగా వారు తెలిపారు.

## నేడు కంబాల పురం గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు

**శ్రీరంగాపూర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండలంలోని కంబలపురం గ్రామంలో గురువారం తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక..కార్యక్రమంలో భాగంగా గ్రామంలో గ్రామ సభను ఉదయం 9 గంటల 30 నిమిషాలకు గ్రామపంచాయతీ కార్యాలయం నందు ఏర్పాటు చేయడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు గ్రామ సర్పంచ్ విజయ్ కుమార్ రెడ్డి తెలియజేయడం జరిగింది. ఈ గ్రామ సభలో ప్రభుత్వ పథకాల గురించి లబ్ధిదారుల వివరాలు గ్రామ అభివృద్ధి పనులు గ్రామ సమస్యలు పరిష్కారాలు వీటన్నిటి పైన ప్రజల అభిప్రాయాలను తెలియజేయవలసి ఉంటుందని గ్రామ అభివృద్ధి కోసం వార్డు మెంబర్లు యువకులు గ్రామ పెద్దలు మహిళలు అందరూ తప్పనిసరిగా హాజరై తగిన సూచనలు సలహాలు ఇవ్వాలని కోరడం జరిగింది.

## మేఘన్న అభయస్తం ద్వారా కుటుంబానికి ఆర్థిక సహాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

**రేవల్లి,ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** రేవల్లి మండలం చెన్నారం గ్రామంబంకల శంకర్ తండ్రి చంద్రయ్య (50) ఆరోగ్యం బాగాలేక చనిపోయారు. విషయాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు ఏదుల మండలం కాంగ్రెస్ నాయకులు సుఖేందర్ రెడ్డి తెలియజేశారు.ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి అభయస్తం ద్వారా చనిపోయిన బంకల చంద్రయ్య కుటుంబానికి రూ. 5000లు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో బుద్ధం శ్రీకాంత్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాలమ్మ ,వార్డ్ మెంబర్ బంకల చెన్నమ్మ,బంకల గిరిబాబు, బందె శ్రీనివాసరెడ్డి, బంకల శాంతయ్య, గుణగంటి వెంకటస్వామి, కిల్లే బీరయ్య, ఆవుల పవన్ కుమార్, బందెల రవీందర్ రెడ్డి, బంకల రాములు, బంకల వేణు, కురువ రాజు పాల్గొన్నారు.

## శేర్నపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీప పథకం ద్వారా సీసీ రోడ్డు నిర్మాణ ప్రారంభం


సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

**నారాయణ పేట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** నారాయణపేట మండలం శేర్నపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎన్ఆర్ఈజీప ద్వారా రూ.5,00,000 నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి నారాయణపేట జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, జిల్లా మత్స్య శాఖ చైర్మన్ ఆలుగడ్డ కాంతు ముఖ్య అతిథులుగా విచ్చేసి రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రంగం అనురాధ వెంకటేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువత యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి ఈ సీసీ రోడ్డు ఎంతో ఉపయోగపడుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఇండ్ల గణనను పారదర్శకంగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

**గద్వాల ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** జనగణన–2027లో భాగంగా ఇండ్ల గణనను పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జనగణన-2027 ఫేస్1(గృహ గణన) పై ఫీల్డ్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనగణన కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. జనగణన దేశ అభివృద్ధికి ముఖ్యమైన ప్రాథమిక సమాచార సేకరణ ప్రక్రియ అని తెలిపారు.ప్రతి అంశాన్ని ఖచ్చితంగా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జనగణన క్షేత్రస్థాయిలో పనిచేసే ఎన్యుమరేటర్ల పనితీరుపైనే ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఈనెల 18 నుండి క్షేత్రస్థాయి సిబ్బందికి పకడ్బందీగా శిక్షణ నిర్వహించాలని పేర్కొన్నారు. జనగణనలో మొబైల్ యాప్‌లు, డిజిటల్ పరికరాల వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వబడుతున్నదని తెలిపారు.తద్వారా డేటాను వేగంగా మరియు తప్పులు లేకుండా సేకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఓ పాపయ్య, ప్రిన్సిపాల్ ఐటీఐ రామ్ మోహన్, ట్రైనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు : ఎస్పీ


జిల్లా ఎస్పీ డా. వినీత్

**నారాయణ పేట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగ కార్యక్రమాలు నిషేధం జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఈ నెల రోజుల పాటు 30 పోలీస్ యాక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డా.వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఏప్రిల్ 30వ తేదీ వరకు అమల్లో ఉన్న ఈ చట్టం ప్రకారం జిల్లాలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు లేదా ప్రజలు గుమికూడే కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా జీవనానికి అంతరాయం కలిగించే విధంగా సమావేశాలు, జనసమూహాలు ఏర్పాటు చేయడం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. అలాగే సోషల్ మీడియా ద్వారా అనవసరమైన, మతాల మధ్య విద్వేషాలు రేకెత్తించే పోస్టులు లేదా సమాచారాన్ని వ్యాప్తి చేసిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ యాక్ట్" ప్రకారం శిక్షార్హులవుతారని ఎస్పీ హెచ్చరించారు. అందరూ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ, ఏవైనా కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే ముందస్తుగా దరఖాస్తు చేసుకుని పోలీసుల అనుమతులు పొందాలని ఎస్పీ డా. వినీత్ కోరారు.

## నేటి నుంచి శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**చిన్న చింతకుంట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** మండలంలోని చిన్న వడ్డెమాన్ గ్రామ సమీపంలో స్వయంభుగా వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి 6వ తేదీ వరకు జరగనున్నాయి. గురువారం చైత్ర పూర్ణిమ సందర్భంగా ఆలయంలో ధ్వజారోహణం, సాయంత్రం రథోత్సవం, 3న ఆయా గ్రామాల నుంచి వచ్చిన భజన పరులతో అఖండ భజన కార్యక్రమం, రాత్రికి నందికొల్ల సేవ, తెల్లవారుజామున అగ్నిగుండం, 4న స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ అన్నపూర్ణాదేవికి శ్రీ సూక్తముగా అభిషేకం, అర్చన, శ్రీ లలిత సహస్ర అమ్మవారికి కుంకుమార్చన, రాత్రికి డోలహరణ నామకరణ పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. 5న శ్రీ పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం, 6న వసంతోత్సవం, ఉత్సవాల పరిసమాప్తి ఉంటాయని ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు. శ్రీ రామలింగేశ్వర ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఉత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఉచిత అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.


ఉత్సవాలకు ముస్తాబైన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం

## బీడీ కూలి రూ.400 లకు పెంచాలి

### తెలంగాణ బీడీ కార్మిక సంఘం డిమాండ్

**చిన్న చింతకుంట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** బీడీ కార్మికుల వేతన ఒప్పందం గడువు ముగియడంతో ప్రస్తుతం పెరిగిన ధరలు కనుగుణంగా వెయ్యి బీడీలకు రూ.400 కూలి పెంచాలని టిఎఫ్‌టియు అనుబంధ సంఘమైన తెలంగాణ బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఖలీల్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో బీడీ యజమాన్యానికి బీడీ కూలి పెంపుపై డిమాండ్ నోటీసులను అందజేసినట్లు తెలిపారు.రెండు సంవత్సరాల క్రితం జరిగిన బీడీ కూలి ఒప్పంద వేతనంతో బీడీ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడ్డారన్నారు. బీడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వయసు పైబడిన బీడీ కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. గ్రాట్యూటీ చట్ట ప్రకారం అమలు చేయాలని, యజమాన్యం బాధ్యతగా పిఎఫ్ సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, నాయకులు జలాల్ పాషా, రాజేశ్వర్, శంకర్, నెత్తుల రాములు, రవి, శ్రీను, లింగన్న, కుమ్మరి వెంకటన్న, నరసింహ, కృష్ణ, ఎస్తేరమ్మ, రాణమ్మ తదితరులు ఉన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభలు

**కెటిదొడ్డి ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక భాగంగా "99 "రోజుల యాక్షన్ ప్లాన్ నందు నేడు అన్ని గ్రామ పంచాయితీల యందు గ్రామసభల నిర్వహణకు ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి గ్రామ సభలకు ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. నేటి గ్రామసభల యందు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన వివిధ పథకాల గురించి తెలియజేస్తూ రాబోయే కాలంలో కొత్తగా ప్రవేశ పెట్టే పథకాల గురించి అవగాహన కల్పిస్తూ, బాల్యవివాహాల నిరోధం పైన బాల కార్మిక వ్యవస్థ రద్దు దిశగా అడుగులు వేయాలని అలాగే ప్రతి ఒక్కరు చదువుకునే విధంగా అవగాహన కల్పిస్తూ గ్రామ సభలు నిర్వహించాలని +జిల్లా కలెక్టర్ ఆదేశించిన సందర్భంలో రేపటి కార్యక్రమాలు విజయవంతం అయ్యే విధంగా చూడాలని మండల ప్రత్యేక అధికారి అక్బర్ భాషా నేటి రివ్యూ మీటింగ్ లో తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహసిల్దార్, మండల విద్యాధికారి , మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు..

## విమల్ చౌదరి ఉదారత..

### మోత్కులకుంట తండాకు 180 గజాల స్థలం డొనేట్

**రాజాపూర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** రాజాపూర్ మండలం మోత్కులకుంట గ్రామపంచాయతీలో అంతర్గత మురుగునీటి కాలువ ఏర్పాటు కోసం కొద్ది స్థలం అవసరం కాగా గ్రామ సర్పంచ్ గీత కృష్ణ నాయక్, కొందరు గ్రామస్తులు మార్వాడి విమల్ చౌదరిని సంప్రదించారు. దీంతో స్పందించిన విమల్ చౌదరి 180 గజాల స్థలాన్ని అంతర్గత మురుగునీటి కాల్వ కోసం ఉచితంగా అందజేశారు. ఉచితంగా స్థలాన్ని అందజేసిన విమల్ చౌదరిని గ్రామ సర్పంచ్ గీతాకృష్ణ నాయక్ తో పాటు వార్డు సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాగ్యలత, వార్డు సభ్యులు శీను నాయక్, తండా యువకులు రమేష్, అనిల్, వశ్య, శ్రీనివాస్, పవన్, శ్రవణ్, బాలు, వంశీ, వినోద్ తదితరులు ఉన్నారు.

## ఇటిక్యాల పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ


ఫార్మసీ ని పరిశీలిస్తున్న హెల్త్ డాక్టర్ రవీంద్ర నాయక్

**ఎర్రవల్లి ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** ఇటిక్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను బుధవారం డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీంద్ర నాయక్ డిఎం అండ్ హెచ్ ఓ సంధ్య కిరణ్ మై ఆకస్మిక తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీ ని పరిశీలించారు.డాక్టర్ రాధికను ఓపి సంఖ్యను, డెలివరీసు పెంచాలని సూచించారు.స్టాఫ్ అందరూ సమయపాలన పాటించాలని పేషెంట్లను మంచిగా చికిత్స చేయాలని సూచించారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాలు 100 పూర్తి చేయాలని సూచిం చారు. అన్ని జాతీయ కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు చేరేలా సరైన సేవలను చేయాలని సూచించారు. నిర్ధారించిన టార్గెట్లను పూర్తి చేసి జిల్లాను మొదటి స్థానంలో ఉంచాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీ లో డాక్టర్ సిద్ధప్ప, డాక్టర్ రాజు, డాక్టర్ అజ్గర్ అలీ పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాలను బలోపేతం చేయాలి



విద్యార్థులకు ల్యాప్ ట్యాబ్ లను అందజేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల ఏప్రిల్ 01, ప్రభాతవార్త :** అంగన్వాడి కేంద్రాలను బలోపేతం చేసేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు.ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ కు ఎంపికైన గట్టు మండలంలో అంగన్వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించడంలో శిక్షణ ఫౌండేషన్ సహకారం అందిస్తుండడంతో బుధవారం గద్వాల వజ్రా బంకిట్ హాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గట్టు బ్లాక్ లో ఉన్న ప్రతి అంగన్వాడి కేంద్రం నిర్వాహకులు బాధ్యతతో పనిచేస్తున్నారని, సంపూర్ణత అభయాన్ 2.0 లో.వంద శాతం లక్ష్యాలను సాధించాలన్నారు. అంగన్వాడి కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్యను కూడా బోధించేలా చర్యలు తీసుకోవడంతో చిన్నారుల ప్రాథమిక విద్యకు ఆక్కడే నాంది పడుతుందన్నారు. బడిబాట మాదిరే అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెరిగేందుకు వేసవి సెలవుల్లో ప్రత్యేక కార్యాచరణతో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన పెంపొందించాలన్నారు. అనంతరం శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పలువురు అంగన్వాడీ కార్యకర్తలకు బహుమతులు, ధ్రువపత్రాలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే గట్టు మం డలానికి చెందిన నలుగురు విద్యార్థులకు కలెక్టర్ శిక్షణ ఫౌండేషన్ వారి ఆధ్వర్యం లో లాప్ టాప్స్ అందించారు. ఈ కార్యక్ర మంలో డిడబ్ల్యూఓ సునంద, ఎంపీడీవో చెన్నయ్య, సిడిపిఓ హేమలత, శిక్షణ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ కాశీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సొంతింటి కల ప్రజా పాలనతోనే సాధ్యం


నూతన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

**గద్వాల ఏప్రిల్ 01, ప్రభాతవార్త :** నిరుపేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించే విధంగా ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిందని,పేద ప్రజల స్వంత ఇంటి కల సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన తోనే సాధ్యం అని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గద్వాల మండలం పరిధిలోని బీరెల్లి గ్రామంలో మొట్టమొదటి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యతిథులుగా హాజరై నూతన ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంబించారు. గద్వాల మండలం బీరెల్లి గ్రామంలో కళ్యాణి ర్ర బజారి పరుశరాముడు, తెలుగు పల్లవి శేఖర్, తెలుగు శ్రీదేవి ఇళ్లు ను బండారి రవి లకు మంజూరు కావడం జరిగినది. బుధవారం ఇల్లు నిర్మాణం చేసుకొని నూతన గృహప్రవేశం చేస్తున్న లబ్దిదారుల ఇళ్లను ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూనూతన ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన లబ్ధిదారులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరు పేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయించి వారికి విడతల వారీగా వారి ఖాతాలు డబ్బులను ఐదు లక్షల రూపాయలను నమోదు చేయడం జరుగుతుందని, వాటికి తోడుగా లబ్ధిదారులు మరికొంత డబ్బులను తో ఇంటిని అన్ని వసతులతో ఏర్పాటు చేసుకోవడం జరిగినదన్నారు.గద్వాల నియోజకవర్గంలో మొదటి విడత లో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగినదని, దాదాపుగా 1500 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్న. త్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేయాలన్నారు.ప్రజలు ఎవరు కూడా ఆందోళన అపోహాలు పడాల్సిన అవసరం లేదని, ఇల్లు కట్టించుకుంటే డబ్బులు రావని అపోహాలు వద్దని, ఇల్లు రాని వారు ఎవరు కూడా ఆందోళన పడవద్దన్నారు. రెండో విడతలో అర్హులైన లబ్ధిదారులు కు అందరికి మంజూరు అయ్యే విదంగా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయడు, మహేశ్వర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ కవిత రాధాకృష్ణారెడ్డి, నాయకులు నీలేశ్వర్ రెడ్డి, శ్రీరాములు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యువత ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**గద్వాల ఏప్రిల్ 01, ప్రభాత వార్త :** ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ పథకం మూడవ దశ ప్రారంభమైందని, అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టి. రామలింగేశ్వర గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ,భారత ప్రభుత్వం వారు అమలు చేస్తున్న ఈ పథకం యువతకు పెద్ద కంపెనీల్లో పని చేసే అవకాశం కల్పించి,వారి నైపుణ్యాలను పెంచి,భవిష్యత్‌లో మంచి ఉద్యోగ అవకాశాలు పొందేందుకు ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు.ఈ పథకం కింద ఎంపికైన వారికి 6 నుండి 9 నెలల పాటు ఇంటర్న్ షిప్ అవకాశం ఉంటుందని తెలిపారు.నెలకు రూ.9,000 స్టైపెండ్‌తో పాటు ఒకేసారి రూ.6,000 గ్రాంట్ అందించబడుతుందని తెలిపారు.అలాగే బీమా సౌకర్యం కూడా కల్పించబడుతుందని తెలిపారు.18 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు,10వ తరగతి, ఇంటర్,ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ/పీజీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ఈ పథకానికి అర్హులని తెలిపారు.కుటుంబ వార్షిక ఆదాయం రూ.12 లక్షల లోపు ఉండాలన్నారు.అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని,ఆధార్,మొబైల్, ఈమెయిల్ ద్వారా ధృవీకరణ పూర్తి చేసి,తమ అర్హతలకు అనుగుణంగా గరిష్టంగా మూడు ఇంటర్న్ షిప్ అవకాశాలను ఎంపిక చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్: 1800116090 లేదా జిల్లా పరిశ్రమల కేంద్రం, జోగులాంబ గద్వాల జిల్లా కార్యాలయం లో సంప్రదించవచ్చని తెలిపారు.

## చౌక ధరల దుకాణాల డీలర్ల నియామక దరఖాస్తుల ఆహ్వానం

**గద్వాల ఏప్రిల్ 01, ప్రభాతవార్త :** జిల్లాలో చౌక ధరల దుకాణాల డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆర్డీఓ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ గ్రామాలలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చౌక ధరల దుకాణాల డీలర్ల నియామకానికి సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయబడినట్లు తెలిపారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం అలంపూర్ మండలంలోని అలంపూర్ 2602009, క్యాతూర్ 2601021 గ్రామాలు,ఉండవెల్లి మండలంలోని బోన్కూర్ 2611010 గ్రామం, మానోపాడు మండలంలోని చందూరు 2609014, నారాయణపూర్ 2609015,అయిజ మండలంలోని జడదొడ్డి 2605030, కూడకనూరు 2605038,అయిజ 2605046గ్రామాలు,అలాగే రాజోలి మండలంలోని పడమటిగార్లపాడు 2610001, పచ్చర్ల 2610020 గ్రామాలు,వడ్డేపల్లి మండలంలోని పైపాడు 2612006 గ్రామం, ఎర్రవల్లి మండలంలోని వల్లూరు 2613001, రాజశ్రీ గార్లపాడు 2613006 గ్రామాలు, ఇటిక్యాల మండలంలోని మొగిలిరావలచెరువు గ్రామాలలో ఎఫ్.పి.ఎస్ డీలర్ ఖాళీలు భర్తీ చేయబడనున్నట్లు తెలిపారు.పై గ్రామాలకు చెందిన స్థానిక అర్హత కలిగిన అభ్యర్థులు ప్రభుత్వ మార్గదర్శకాలు,అర్హతలు మరియు రిజర్వేషన్ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు.రిజర్వేషన్ వారీగా ఖాళీల వివరాలు,అర్హతలు,అవసరమైన ధ్రువపత్రాలు మరియు దరఖాస్తు విధానం సంబంధిత తహసీల్దార్ కార్యాలయాలలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో 15.04.2026 సాయంత్రం 5:00 గంటల లోపు సమర్పించవలసి ఉంటుందని, గడువు తేదీ అనంతరం అందిన దరఖాస్తులు ఏ విధంగానూ పరిగణించబడవని స్పష్టం చేశారు.ఈ అవకాశాన్ని ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కోరారు.

## రేషన్ దుకాణాలలో స్టాక్ బోర్డు పట్టిక ఎక్కడ..?


బాలరాజ్,జిల్లా పౌర సరఫరాల అధికారి

**మద్దూరు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఉమ్మడి మద్దూరు, కొత్తపల్లి మండల వివిధ గ్రామాలలో చౌక ధరల దుకాణాలలో స్టాక్ బోర్డు వివరాలతో కూడిన పట్టికను విధిగా ప్రదర్శించాలి .మొత్తం ఎన్ని కుటుంబాలు ఆహార భద్రతా కార్డులు కలిగి ఉన్నాయి..ఇప్పటివరకు ఎంతమందికి బియ్యం పంపిణీ పూర్తయ్యింది. ఇంకా ఎంతమందికి పంపిణీ చేయాల్సి ఉంది,తదితర వివరాలు "స్టాక్ రిజిస్టర్" లో ప్రదర్శించాలని నిబంధన ఉన్నా అవి ఏ రేషన్ డీలర్ పాటించడం లేదు.రేషన్ షాపులోని బియ్యం నిల్వలు,వాటి నాణ్యతను స్టాక్ వివరాల పట్టికను తనిఖీ చేసే అధికారులే" కరువయ్యారు. ఒకవేళ తనిఖీ చేసిన చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు, ప్రభుత్వం పేద కుటుంబాల వారికి "ప్రజా పంపిణీ"వ్యవస్థ ద్వారా ఉచితంగా "సన్న బియ్యం" అందిస్తున్న నేపథ్యంలో..పారదర్శకత కోసం రేషన్ దుకాణాలలో తప్పనిసరిగా స్టాక్ వివరాల పట్టికను ప్రదర్శించాలని నిబంధనలు ఉన్న తుంగలో తొక్కుతున్నారు. ఈ మేరకు ఉమ్మడి మద్దూరు, కొత్తపల్లి మండల వ్యాప్తంగా "అన్ని రేషన్ షాపుల"లో సన్న బియ్యం పంపిణీ లో అవకతవకలకు తావు లేకుండా పకడ్బందీ గా జిల్లా అధికారులు పర్యవేక్షణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

**జిల్లా అధికారిని వివరణ కోరగా..** రేషన్ దుకాణాల్లో స్టాక్ బోర్డు వివరాల ప్రదర్శన తప్పనిసరి. ఎక్కడైనా నిబంధనలు పాటించకపోతే వెంటనే చర్యలు తీసుకుంటాం. సంబంధిత డీలర్లకు నోటీసులు ఇస్తాం. అటువంటి ఫిర్యాదులు మా దృష్టికి వస్తే వెంటనే తనిఖీలు నిర్వహించి, రేషన్ పంపిణీలో పారదర్శకతను ఖచ్చితంగా అమలు చేస్తాం" అని పేర్కొన్నారు.

## జాతర ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి

### అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్


పోలీస్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ ఎండి రియాజ్ హుల్‌హక

**మద్దూరు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ డా. వినీత్ ఉత్తర్వుల మేరకు నారాయణపేట జిల్లా, కొత్తపల్లి మండలం, తిమ్మారెడ్డిపల్లి వద్ద బావోజి జాతర సందర్భంగా బందోబస్తుకొచ్చిన పోలీస్ అధికారులు సిబ్బందికి అదనపు ఎస్పి ఎండి రియాజ్ హుల్ హక్ భద్రత పరమైన సూచనలు తెలిపారు. భావోజి జాతరకు మొత్తం బందోబస్తు అదనపు ఎస్పి 01, డీఎస్పీ 01, సిఐ 02, సిఐలు 10, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్, మహిళా పోలీసులు, మొత్తం 150 మంది పోలీసులతో ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అదనపు ఎస్పీ తెలిపారు. అనంతరం జాతర భద్రత ఏర్పాట్లను పరిశీలించి పోలీస్ అధికారులు, సిబంది తమకు కేటాయించిన ప్రదేశంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తేరు కార్యక్రమం ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని తెలిపారు. జాతరలో దొంగతనాలు ఈవ్ టీజింగ్ జరగకుండా మఫ్టీలో పోలీసులను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎమర్జెన్సీ సమయంలో ప్రజలకు భక్తులకు అందుబాటులో పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయాల్ 100 కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోస్గి సీఐ సైదులు, మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చలివేంద్రమును ప్రారంభించిన ఎమ్మెల్యే

**గద్వాల ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** గద్వాల నియోజకవర్గం లోని ధరూర్ మండల కేంద్రంలోని ధరూర్ సర్పంచ్ డి ఆర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వేసవి కాలం సందర్భంగా ఏర్పాటు చేసిన చలివేంద్రంని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు తోడుపాటుగా ఇలాంటి చలివెంద్రాలను ఏర్పాటు చేయడంపై సంతోషం వ్యక్తం చెశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు మహేశ్వర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, డి. వై రామన్న, మాజీ సర్పంచ్ విజయ్ భాస్కర్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండలానికి ఎమ్మెల్యే, కలెక్టర్ రాక

**చిన్నచింతకుంట,ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** మండలంలోని ఉంద్యాల గ్రామానికి దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా గురువారం రానున్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ పాల్గొంటారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, పలు అభివృద్ధి పనులపై ఈ గ్రామ సభలో చర్చించనున్నారు.

## జాతీయ నెట్‌బాల్ పోటీల్లో ధన్వాడ గురుకుల విద్యార్థుల సత్తా



**ధన్వాడ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలోని కొండాపూర్ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులం విద్యార్థులు జాతీయస్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచారు. కిషన్, మోహన్, హర్షవర్ధన్‌లు తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఉత్తర ప్రదేశ్ లో మార్చి 29 నుంచి 31 వరకు నిర్వహించిన 4వ జూనియర్ నేషనల్ మిక్స్‌డ్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించడం గర్వకారణంగా నిలిచింది. వారి కృషి, పట్టుదల, జట్టు భావనకు ఈ విజయం నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా గురుకులం అధ్యక్షుడు డా. ఎస్. రమేష్, కార్యదర్శి డా. ఎం. రామ్ మోహన్ గౌడ్, సీనియర్ ఉపాధ్యక్షుడు ఎం. రాజారం, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, పీఈటీ అంజనేయులు విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షి ంచారు.ఈ విజయంతో సంస్థకు, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకువచ్చారని వారు పేర్కొన్నారు.

## గ్రామసభలపై సమీక్ష సమావేశం

**వెల్దండ, ఏప్రిల్ 01 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో కార్యక్రమంలో భాగంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రామసభలలో తీసుకోవాల్సిన చర్యలపై ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణయ్య అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 32 గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, అదేవిధంగా ఈ నెల 4వ తేదీన 10 గంటలకు మండలస్థాయి అన్నిశాఖల అధికారులతో సమావే శాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమంలో తహసిల్దార్ కార్తీక్ కుమార్,చంద్రుడు,ఎంపీఓ లక్ష్మణ్, సూపరింటెండెంట్ మోహన్‌లాల్‌తో పాటు గ్రామ ప్రత్యేకఅధికారులు ,కార్యదర్శులు ఉన్నారు.

## మానవత్వం చాటుకున్న స్నేహితులు

### మృతుడి భార్యకు రూ.1.5 లక్షలు నగదు అందజేత

**రాజాపూర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** తమతో కలసి విద్యాబుద్ధులు నేర్చుకున్న బాల్య మిత్రుడు రాజాపూర్ మండలం చెన్నవెల్లి గ్రామానికి చెందిన చిల్వేర్ నరేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం చిన్ననాటి స్నేహితులను కలిచివేసింది. నిర్మల విద్యాలయం కల్వకుర్తి లో చదివిన బాల్య స్నేహితులు టెన్త్ క్లాస్ ఫ్రెండ్స్ బ్యాచ్ (2005) తన స్నేహితుడు నరేష్ మంణ వార్త తెలుసుకొని సాయం చేయాలని అతని పిల్లల కోసం రూ. 1.50 లక్ష యాభై వేలు నగదును బుధవారం స్నేహితులు తిరుమలాపూర్ గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్, సురేష్ రెడ్డి, దేవేందర్ గౌడ్, గోపాలకృష్ణ చారి, స్నేహితులు అందరూ కలిసి నరేష్ భార్య సుభద్రకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, పలువురు ఇలాంటి స్నేహితులను కలిగి ఉండటం గొప్ప వరమని వారు కొనియాడారు.

## విద్యార్థులు, నిరుద్యోగులకు బంగారు అవకాశం

### - ధన్వాడలో అవగాహన కార్యక్రమం

**ధన్వాడ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** ధన్వాడ మండల కేంద్రంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం గురువారం రోజు నిర్వహించనున్నారు. 7, 8, 9 తరగతుల విద్యార్థులతో పాటు ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువత ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు.ఈ సందర్భంగా ఉన్నత విద్య, వ్యక్తిత్వ వికాసం, ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు అవసరమైన ప్రిపరేషన్ విధానం, సిలబస్‌పై నిపుణులు సమగ్రంగా మార్గదర్శనం చేయనున్నారు. నారాయణపేట జిల్లా ట్రైని కలెక్టర్ ప్రణయ్ కుమార్ (ఐఏఎస్) ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. మరిన్ని వివరాలకు 9177789737 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఉపాధ్యాయులు, యువజన సంఘాల నాయకులు, సమాజ ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొని యువత భవిష్యత్తుకు దోహదపడాలని కోరారు.

## క్రీడో తల్లిదండ్రుల భాగస్వామ్య కార్యక్రమం...

**దేవరకద్ర,ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** దేవరకద్ర మండల కేంద్రంలోని శ్రీవాణి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో క్రీడో యొక్క తల్లిదండ్రుల భాగస్వామ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు సబ్జెక్టు ప్రాథమిక భావనలైన గణితంలో సర్కిల్ సిలిండర్ ట్రేపిజియం, ఆరోన అవరోహణ సంఖ్యలు ,స్థాన విలువలు పరిసరాల విజ్ఞానంలో మ్యాపులు, విశ్లేషణ ప్రపంచ పటంలో సముద్రాలు ఖండాలు గుర్తించడం, బాడీ యొక్క భాగాలు, నాడీ వ్యవస్థ జీవావరణ ఆహారపు గొలుసులు సోలార్ సిస్టం ఎర్త్ మూమెంట్ ఆంగ్ల భాషలో ఏ బి సి డి ల ఉచ్చరణ విధానం జీవుల రకాలు వంటి విషయాలపై ప్రదర్శనలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా క్రీడో పాఠ్య ప్రణాళిక పై విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఈ ప్రోగ్రాం విద్యార్థులకు చాలా సులువైన లెర్నింగ్ బై డూయింగ్ మెథడ్స్ లో నేర్చుకోవడానికి అనువుగా ఉండే అద్భుతమైన ప్రోగ్రాం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వసంత సుధాకర్ రెడ్డి, వినోద్ కుమార్, ఉపాధ్యాయులు ప్రశాంతి ,వెంకటేశ్వరి, అనసూయ, యశస్విని, అశ్విని, అనంత, భాగ్య, వసంత, అన్నపూర్ణ, భవాని, చంద్రశేఖర్, శ్రీనివాసులు, వరుణ్ తేజ్, రవి, వివిధ గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



జోగులాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

## ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత రానివ్వొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఘనంగా స్వాగతం పలికారు. బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగులాంబ అమ్మవారిని కలెక్టర్ దర్శించుకునీ ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి, అమ్మవార్ల ప్రసాదాలను కలెక్టర్‌కు అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు అలంపూర్ దేవాలయాలవిశిష్టతను కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ పర్యటనలో అలంపూర్ మండల ప్రత్యేకఅధికారి విమల, తహసిల్దారు ప్రభాకర్, ఎంపీడీవో పద్మావతి, మున్సిపల్ కమిషనర్ శంకర్, ఇతర అధికారులు, తదితరులున్నారు.

## మంత్రుల పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించిన సమయానికి కార్యక్రమాలు సజావుగా జరిగేలా అధికారులు అన్ని చర్యలుచేపట్టినట్లు తెలిపారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, ప్రజలకు ఎలాంటిఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తాగునీరు, పారిశుద్ధం, పార్కింగ్ వంటి సౌకర్యాలను సమకూర్చాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.

## జబర్దస్త్ ఫేమ్ కొమురక్కపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఫోటో దిగడానికి వచ్చామని నమ్మించి ఇంటి వద్దకు చేరుకున్నారు. అనంతరం కొమరయ్య అసిస్టెంట్ శ్రీనాథ్‌ను ఎందుకు తిట్టావని, బంగారం పోయిందని నింద మోపావని ప్రశ్నిస్తూ, బూతులు తిడుతూ దౌర్జన్యానికి దిగారు. ఈ క్రమంలో వంశీకృష్ణ రాయితో కొమురయ్యపై దాడి చేశాడు. ఈ సమయంలో కొమురయ్య సోదరుడు యాదయ్య అడ్డుకోవడానికి రాగా, వికాస్ రాయితో అతని భుజంపై కొట్టి గాయపరిచాడు. చంద్రశేఖర్ కర్రతో కొమురయ్య కుడిచేతిపై దాడి చేయడంతో స్వల్ప గాయాలయ్యాయి. మొత్తం 8 మంది కలిసి కొమురయ్య, యాదయ్యపై దాడి చేసి, నిన్ను ఎప్పటికైనా చంపుతాం"అంటూ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గొడవను ఆపడానికి వచ్చిన రాముపై కూడా నిందితులు రాళ్లతో దాడి చేయగా అతని కుడి చేయి చిటికెన వేలికి స్వల్ప గాయం అయింది. బాధితుల కేకలు విని గ్రామస్తులు అక్కడికి చేరుకుని నిందితులను పట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో నిందితులు ఒక బైక్‌ను గ్రామంలో వదిలేసి పరారయ్యారు. కొమరయ్య ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సూచనలపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, అన్నింటినీ పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. జయంతి వేడుకలను విజయవంతం చేయడంలో దళిత, కుల సంఘాల నాయకులు పూర్తి సహకారం అందించాలని కోరారు. తదుపరి జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి సునీత మాట్లాడుతూ, జయంతి వేడుకలను ప్రోటోకాల్ ప్రకారం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మేయర్, కార్పొరేటర్లు, దళిత మరియు కులసంఘాల నాయకులను ఆహ్వానిస్తామని చెప్పారు. బాబు జగ్జీవన్‌రామ్, డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలర్పణ కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం అంబేద్కర్ కళాభవన్‌లో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఇరుజయంతి వేడుకల కోసం ప్రభుత్వం నుండి రూ. 1లక్ష చొప్పున నిధులు కేటాయించినట్లు తెలిపారు. విగ్రహాల వద్ద శుభ్రత, అలంకరణ, అవసరమైన మరమ్మతు పనులను మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి సునీత, దళిత సంఘాలు, కుల సంఘాల నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలకు తు.చ. తప్పకుండ పాటించాలని, సకాలంలో రెన్యువల్ కు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఆస్పత్రులు పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రులు, క్లినిక్‌లలో రేట్ ఛార్ట్స్ తప్పక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా స్కానింగ్ కేంద్రాలలో ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా జాగ్రత్త పడాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవని తెలిపారు. అటువంటి సంఘటనలు ఏవైనా జిల్లాలో ఉంటే దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సాయినాథ్ రెడ్డి, డిఎస్పీ బాలాజీ నాయక్, డిప్యూటీ డిఎంహెచ్ ఓ శ్రీనివాసులు, డా. బాబు, ఆర్డీఎస్ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్, ఇతర డాక్టర్లు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీషిరిడి సాయిబాబా విగ్రహ ప్రతిష్టాపన



విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**దామరగిద్ద, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల కేంద్రంలో శ్రీ షిరిడి సాయిబాబా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మొదటి రోజు నిర్వహణను వన్నాడ విజయలక్ష్మి-వెంకటప్ప (బొంబాయిషేట్) దంపతులు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ప్రారంభంలో సంకల్పం, గణపతి పూజ, పుణ్యవచనం నిర్వహించారు. అనంతరం సవత్స గోవుతో యాగశాల ప్రదక్షిణ, గోపూజలు ఘనంగా నిర్వహించబడినాయి. తరువాత ధ్వజారోహణం, షోడశ స్తంభ పూజ, మండప ఆహ్వాన పూజలు వైభవంగా నిర్వహించారు. మహా మంగళహారతి, ప్రదోష పూజలతో పాటు జలాధివాస కార్యక్రమం నిర్వహించగా మొత్తంకార్యక్రమం భక్తి పరవశ్యంలో కొనసాగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా మెంటేపల్లి పురుషోత్తంరెడ్డి

**వనపర్తి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ ఇటీవల తెలంగాణ రాష్ట్ర పార్టీ, కార్యవర్గ సభ్యునిగా నియమించిన సందర్భంగా బుధవారం వనపర్తిలో జరిగిన ఒక కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ, ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు శ్రీనివాస్ గౌడ్, కల్పన పురుషోత్తం రెడ్డిని ఘనంగా శాలువాలతో శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ నా మీద నమ్మకంతో ఈహోదా ఇచ్చిన రాష్ట్ర పార్టీకి, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, నాకు ఇచ్చిన ఈ అవకాశాన్ని వనపర్తి జిల్లా, నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని రాబోయేశాసనసభ ఎన్నికల్లో వనపర్తి నియోజక వర్గాన్నిభారతీయ జనతాపార్టీఅభ్యర్థి గెలుపుకుసంసిద్ధం చేస్తామని తెలిపారు.

# ఆన్‌లైన్ ద్వారా ఇసుక బుకింగ్

- మన ఇసుక వాహనం ద్వారా సరఫరా చేయాలి
- మాన్యువల్ కూపన్‌లు జారీ చేయరాదు
- మహబూబ్‌నగర్ కలెక్టర్ కుష్బూ గుప్తా



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మూసాపేట్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆదేశాల ననుసరించి ఏప్రిల్ 1నుండి జిల్లాలో ఇసుక బుకింగ్, సరఫరా ను మన ఇసుక వాహనం ద్వారా ఆన్లైన్‌లో మాత్రమే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. మూసాపేట మండలంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూగుప్తా బుధవారం విస్తృత పర్యటన నిర్వహించి, మండలకేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం, చౌకధర దుకాణం, ఇందిరమ్మ ఇళ్లు, అనంతరం పోల్కంపల్లి గ్రామంలో ఇసుక రీచ్, పిఎసిఎస్ ఎరువుల దుకాణంను తనిఖీ చేశారు. తొలుత మూసాపేట్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి మన ఇసుక విధానం ద్వారా ఇసుక బుకింగ్ ఏ విధంగా నిర్వహిస్తున్నారు పరిశీలించారు. జిల్లాలో ఇసుక బుకింగ్, సరఫరా నూరు శాతం ఆన్లైన్‌లో ద్వారానే నిర్వహించనున్నట్లు, మాన్యువల్‌గా కూపన్‌లు జారీ చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. భూ భారతి దరఖాస్తుల పై సమీక్షించారు. 14 దరఖాస్తులు పరిష్కరించవలసి ఉందని తహశీల్దార్ తెలిపారు. నిర్ణీత పెండింగ్ లో నున్న భూ సమస్యల దరఖాస్తులను నిర్ణీత వ్యవధిలో పరిష్కారం చేయాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్న చౌకధర దుకాణం నెంబర్4 ను సందర్శించారు లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం నాణ్యత ఎలా ఉంది అడిగి తెలుసుకున్నారు. బియ్యం నాణ్యత బాగుందని కలెక్టర్ కు తెలిపారు, ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలకు సన్న బియ్యం ఉచితంగా ఏప్రిల్ 30 వరకుపంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్‌తెలిపారు మండలకేంద్రంలో ఉన్న ఇందిరమ్మ పథకం కింద నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పురోగతి, బిల్లుల చెల్లింపుల గురించి తెలుసుకున్నారు. పోల్కంపల్లి లో ఇసుక రీచ్ ను, ఎరువుల దుకాణం తనిఖీ చేసిన కలెక్టర్ అనంతరం జిల్లా కలెక్టర్ మండలంలోని పోల్కంపల్లి గ్రామాన్ని సందర్శించి అక్కడ ఉన్న ఇసుక రీచ్‌ను సందర్శించారు. రీచ్ నుండి ఇసుక సరఫరా కేటాయింపు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. జిల్లాలో ఇసుక కేటాయింపులు ఏప్రిల్ 1 నుంచి పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, తదనుగుణంగా ఇసుక బుకింగ్ ను ఆన్లైన్లోనే నిర్వహించాలని అధికారులకు అన్నారు. ఈ సందర్భంగా అక్కడున్న స్యాండ్ రీచ్ అధికారి రంగయ్యాతోమాట్లాడుతూ ఇసుక బుకింగ్ ఆన్లైన్ ద్వారానే తీసుకుంటున్నారా, రోజుకు ఎన్ని బుకింగ్స్ వస్తున్నాయి, 10 కిలోమీటర్ల పరిధిలో ఇసుకను తరలించేందుకు ఎంత పేమెంట్ తీసుకుంటున్నారు, లేబర్ కు ఎంత చెల్లిస్తున్నారు, ఇసుక అక్రమ తవ్వకాలేమైనా జరుగుతున్నాయా అనే విషయాలను తెలుసుకున్నారు. ఇసుక కేటాయింపులో పారదర్శకత పాటించడంతో పాటు ఎలాంటి అక్రమాలకు తావులేకుండా అధికారులు కట్టుదిట్టంగా వ్యవహరించాలని సూచించారు. తదనంతరం కలెక్టర్ ఖుష్బూ గుప్తా పోల్కంపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని (శితిదిళీ)సందర్శించి, అక్కడ ఉన్న పిఎసిఎస్ ఎరువుల దుకాణం తనిఖీచేశారు. ఈ సందర్భంగా మూసాపేట వ్యవసాయ అధికారి అనిల్‌తో మాట్లాడుతూ యూరియా ఆన్లైన్ బుకింగ్ యాప్ గురించి తెలుసుకున్నారు. అలాగే రైతులకు ఎరువులు సమయానికి అందుతున్నాయా, అందుబాటులో ఉన్న నిల్వలు రైతుల అవసరాలకు సరిపోతున్నాయా అనే విషయాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని, సరఫరాలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. అనంతరం అక్కడున్న ఎరువుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎరువుల విక్రయం, నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో నమోదు చేయాలని, రికార్డులను సరిగా నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, ఆర్.డి.ఓ నవీన్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, పౌర సరఫరాల డి.ఎం. రవినాయక్, గృహ నిర్మాణ పి.డిఓ ఉపేందర్ రెడ్డి, మైన్స్ ఏడి గోవింద రాజులు, తహశీల్దార్ రాజు ఉన్నారు.

## వీరన్నపేట్ అభివృద్ధి బాధ్యత మాది..

### 12వ డివిజన్ లోని వివిధ కాలనీలో పర్యటించిన కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి అడుగులు



కాలనీలో పర్యటిస్తున్న డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** వీరన్నపేట అభివృద్ధి బాధ్యత తనదని ఎక్కడ ఏ సమస్య ఉన్న స్థానిక కార్పొరేటర్ ద్వారా తన దృష్టికి తీసుకురావాలనిమహబూబ్నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి ప్రజలను కోరారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్ లో పర్యటించి డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్‌రెడ్డి ప్రజల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం జాండ్ర సంఘం వారి స్మశానవాటికలో సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపిన సంఘం సభ్యులు వెంటనే వాటిని ఏర్పాటు చేయిస్తామని డిప్యూటీ మేయర్ వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్వ సత్యం, శ్రవణ్ కుమార్, మైత్రి యాదయ్య, మద్దూరి రాఘవేందర్, లీడర్ రఘు, జాండ్ర సంఘం అధ్యక్షుడు బాలరాజ్, మహిళ అధ్యక్షురాలు ప్రసన్న లక్ష్మీ, క్రాంతి, ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.




## గడ్డి మందుపై నిషేధం

- పారాక్వాట్ నిషేధిస్తూ సర్కారు ఉత్తర్వులు
- 60 రోజులపాటు క్రయవిక్రయాలు బంద్
- అతిక్రమిస్తే చర్యలు : జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** పారాక్వాట్ ఒక అత్యంత ప్రమాదకరమైన రసాయన పురుగుమందని, ఇది మనుషులు, జంతువులు మరియు పర్యావరణానికి తీవ్రమైన హాని కలిగిస్తుందని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పురుగు మందును నిషేధించాలని నిర్ణయించింది. మానవ శరీరం నరాల వ్యవస్థ పై అత్యంత ప్రభావం చూపే పారాక్వాట్ను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**60 రోజుల నిషేధం:** తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయం, సహకార శాఖ ద్వారా రైతులు, ప్రజల ఆరోగ్యం పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ముఖ్య నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రమాదకరమైన రసాయన పురుగుమందు అయినపారాక్వాట్ దానిఉత్పత్తులు/ఫార్ములేషన్ల వినియోగం వల్ల మానవులు, జంతువులకు హానికర ప్రభావాలు ఉన్నాయని వివిధ నివేదికలు సూచించాయి. ఈ నేపథ్యంలో, ఇన్సక్టిసైడ్స్ Act, 1968 ప్రకారం ప్రభుత్వం అధికారాలను వినియోగించి క్రింది ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పారాక్వాట్, దాని ఉత్పత్తులుఅమ్మకం, నిల్వ, పంపిణీ, తయారీ, వినియోగం, తక్షణ ప్రభావంతో 60రోజుల పాటు పూర్తిగా నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించింది. వ్యవసాయ శాఖ అధికారులు ఈ నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయనున్నారు. రైతులు, వ్యాపారులు సంబంధిత వర్గాలు ఈ నిషేధాన్ని గౌరవించి ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని ప్రభుత్వం సూచించింది.

**మనుషులపై దుష్ప్రభావాలు :** పారాక్వాట్ శ్వాసకోశంపై తీవ్ర ప్రభావం చూపుతుందనివైద్యులు హెచ్చరిస్తున్నారు. ఊపిరితిత్తులకు తీవ్రమైన నష్టం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిదీర్ఘకాలంలో లంగ్ ఫైబ్రోసిస్ వచ్చే ప్రమాదం ఉందని చెబుతున్నారు. పారాక్వాడ్ మందు మనిషి లోపలికి చేరితే తీవ్ర స్థితిలోప్రాణాపాయం నోటిలో గొంతులో సమస్యలు నోటిలో గాయాలు, కాలినట్టు బాధ, గొంతు మండడం, మింగడంలో ఇబ్బంది, నరాల వ్యవస్థపై ప్రభావం, తలనొప్పితలనిర్బంధం, బలహీనత ఏర్పడుతుందని వైద్యుల ద్వారా తెలుసుకున్న వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి ఇదే విషయాన్ని నివేదించారు. ఈ క్రమంలోరాష్ట్ర ప్రభుత్వం మనుషులపై అత్యంత ప్రభావం చూపే తారక్ వాటిని పూర్తిగా నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నది.



**విక్రయిస్తే కఠిన చర్యలు : బి.వెంకటేష్ జిల్లా వ్యవసాయ అధికారి మహబూబ్‌నగర్ ...** పారాక్వాట్ శరీరంలోకి వెళ్లిన తర్వాత బయటకు తీయడం చాలా కష్టం. చిన్న పరిమాణం కూడా ప్రమాదకరం. ఎక్కువగా ప్రభావం ఊపిరితిత్తులపై ఉంటుంది. పారాక్వాట్ వాడకాన్ని పూర్తిగా నివారిం చాలని వైద్యుల సూచనలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకున్నది. భద్రత గల ప్రత్యామ్నాయ పురుగుమందులు వ్యవసాయ పద్ధతులు అనుసరించాలని సూచించింది. ఈ పురుగుమందును రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. ఎక్కడ విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటాం.

## లేబర్ కోడ్ల రద్దుకు దేశవ్యాప్త బ్లాక్ డే

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** కేంద్ర కార్మిక సంఘాల జేఏసీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన బ్లాక్ డే లో భాగంగా మహబూబ్‌నగర్ స్టేషన్ ఏరియాలో గల ఎల్ఐసి ఉద్యోగ సంఘాలు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కరుణాకర్ గౌడ్, రాజేశ్వర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించిన కొత్త లేబర్ కోడ్లను రద్దుచేసి, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రాష్ట్రంలో అమలు చేయబోమంటూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నేటి నుంచి నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయనున్నట్లు గత ఏడాది నవంబర్ 21న నోటిఫికేషన్ జారీ చేసిందని గుర్తు చేశారు. ఇందుకు గాను జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్లు ఢిల్లీలో సమావేశమై ఏప్రిల్ ఒకటిన బ్లాక్‌డే గా నిరసిస్తూ దేశవ్యాప్త నిరసనలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కర్ణాకర్ గౌడ్, బ్రాంచ్ సెక్రటరీ రాజేశ్వర్, హైదరాబాద్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్, ఎల్ఐసి ఉద్యోగ సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యభిచారం గుట్టు రట్టు

### మహబూబ్‌నగర్ టూ టౌన్ ఇన్స్‌పెక్టర్ ఆధ్వర్యంలో మెరుపు దాడి నిందితుల అరెస్ట్, పరారీలో ప్రధాన నిర్వాహకుడు వివరాలు వెల్లడించిన డి.ఎస్.పి వెంకటేశ్వర్లు

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ లో సీక్రెట్ ఆపరేషన్ ద్వారా వ్యభిచారం గుట్టు రట్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజుద్దీన్ తన సిబ్బందితో కలిసి శ్రీ సాయి బాలాజీ టవర్స్, ఫ్లాట్ నెం.309 వద్ద వ్యభిచారగృహం నడుస్తున్నట్లు గుర్తించి ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో నిర్వాహకుడు సంతోష్‌రెడ్డి పరారీలో ఉండగా, అతనికి సహాయకుడిగా ఉన్న అజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే అక్కడ ఉన్న మరికొంత మంది విటులను గుర్తించి అరెస్టు చేశారు. సంఘటన స్థలంలో ఉన్న మహిళలను రక్షించి, వారికి అవసరమైన సహాయం అందించడంతో పాటు, ఒక మొబైల్ ఫోన్ ఇతర సంబంధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై పోలీసులు నిరంతరం కఠిన చర్యలు తీసుకుంటారని, ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలనుగమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రైడ్‌లో సబ్ ఇన్స్పెక్టర్ విజయ్ భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ రఘునాథ్ రెడ్డి, పోలీస్ కానిస్టేబుళ్లు కలీమ్, శ్రీను, శివారెడ్డి, మహిళా పోలీస్ కానిస్టేబుళ్లు పద్మ, శిల్ప, శైలజ పాల్గొన్నారు. ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన టూ టౌన్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.జానకి అభినందించారు.




నిందితులను అరెస్టు చేసిన పోలీసు అధికారులు

## కుటుంబ వ్యవస్థ కనుమరుగు

(మొదటి పేజీ తరువాయి)

లాభాల కోసం తోడబుట్టిన వారి మధ్యే ద్వేషాలు పెరగడం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. నేడు సమాజంలో ఆత్మహత్యలు పెరగడానికి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడం కూడా కారణమేనని మంత్రి అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు ఇంట్లో పెద్ద దిక్కు ఉండేవారు. కష్టమొస్తే పంచుకోవడానికి, కష్ట సుఖాల్ని పంచుకోవడానికి మనుషులు ఉండేవారు. నేడు ఏకాకి జీవితాల వల్ల, చిన్న సమస్య ఎదురైనా తట్టుకోలేక, చర్చించే వారు లేక ఆత్మహత్యల వైపు మళ్లుతున్నారని పేర్కొన్నారు. అప్పుల బాధ, చిన్నపాటి మనస్పర్థలు ప్రాణాలు తీసుకునేంత పెద్దవికావని, అందరూ కలిసి ఉంటేఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని ఆయన గ్రామస్తులకు హితోపదేశం చేశారు. మనం నింగిలోకి శాటిలైట్లను పంపుతూ అంతరిక్షాన్నిజయిస్తున్నాం. కానీ, అదే ఆధునిక కాలంలో నదీ జలాలను పక్కనే ఉన్న పంట పొలాలకు మళ్లించలేకపోతున్నాం అని మంత్రి శాస్త్రీయప్రగతికి, క్షేత్రస్థాయిపరిస్థితులకు మధ్య ఉన్న అంతరాన్ని ఎత్తి చూపారు. రైతులకు భరోసాఅందించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. సమాజంలో కుటుంబ, నైతిక విలువలు క్షీణించే కొద్దీ సామాజిక సంఘర్షణ, సామాజిక అశాంతి పెరిగే ప్రమాదం ఉందని అన్నారు. అందువల్లసమాజంలో నెలకొన్న అనేక సామాజిక రుగ్మతలను రూపుమాపి ప్రజల్లో వాటిపై అవగాహన కల్పించేందుకు ప్రభాతభేరి అనే సామాజిక చైతన్య కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు తెలిపారు.

## భూత్పూర్ పీహెచ్‌సీకి మిత్ర హోలిస్టిక్ సొసైటీ పరికరాల బహుకరణ

**భూత్పూర్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** భూత్పూర్ ప్రాథమక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)కి హైదరాబాద్‌మిత్ర హోలిస్టిక్ సొసైటీ, భారతీయ స్టేట్ ఆఫ్ ఇండియా వారి సంయుకతత ఆధ్వర్యంలో హెల్త్ కిట్స్(పరికరాలు) ఉదారంగా పంపిణీ చేశారని పీహెచ్‌సీ ఎంఓ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్ తెలిపారు. రాష్ట్రంలో కేవలం రెండే రెండు ఆరోగ్య కేంద్రాలను ఎంపికచేయగా, మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్ పీహెచ్‌సీ, వనపర్తి జిల్లాలోని ఓ అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ కిట్స్ అందజేశారని తెలిపారు. స్ట్రెచర్, వీల్ చైర్, బీపీ అప్రాటస్, గ్లూకోమీటర్, థెర్మోమీటర్, బేబీ బెడ్ వార్మర్, ర్యాక్, స్టీల్ టేబుల్ ఏయిర్‌పోర్ట్ చైర్ ఒక్కొక్కటి చొప్పున బహుకరించారని ఎంఓ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్ తెలిపారు. ప్రస్తుతం భూత్పూర్ పీహెచ్‌సీలో రోగులకు అన్ని మందులు(మెడిసిన్), పరికరాలు (కిట్స్) అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ

**భూత్పూర్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లోని ఐదోవార్డుకు చెందిన గొల్ల లక్ష్మీదేవికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా, బుధవారం వార్డు కౌన్సిలర్ కెంద్యాల పద్మ ఇంటి నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు రవికుమార్, కెంద్యాల రాజేష్‌కుమార్, ఏఈ రవితేజ, ఆర్పీ సరస్వతీతో పాటువార్డు ప్రజలు చెన్నమ్మ, నీలవేణి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

**జడ్చర్ల, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సహాయం అందిస్తున్నట్లు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో నేడు జడ్చర్ల నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన (179) మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు అనారోగ్యం వంటి అత్యవసర పరిస్థితుల్లో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనకుండా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతి అల్వాల్ రెడ్డి, కౌన్సిలర్ చైతన్య చౌహాన్, కోడ్గల్ సర్పంచ్ సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీటెక్ ఫలితాలు విడుదల

**మహబూబ్‌నగర్ ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** పాలమూరు విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ॥ జి.ఎన్‌శ్రీనివాస్ బీటెక్‌పరీక్ష ఫలితాలనువిడుదల చేశారు. ఈకార్యక్రమం లోపరీక్షల నియంత్రణ అధికారి డా. కే.ప్రవీణ, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డా. ఎన్ చంద్ర కిరణ్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డా. అనురాధ రెడ్డి, ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ డా. జి రవీందర్ రెడ్డి, కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ హెచ్ఓడి డా. పండుగ రామరాజు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

**కృష్ణ, ఏప్రిల్1 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణ మండలం, గుడేబల్లూర్ గ్రామంలో జరిగే శ్రీ శ్రీ శ్రీ స్వయంభూ లక్ష్మి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులకు స్థానికులకు ఎలాంటి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా స్థానిక గ్రామ సర్పంచ్ ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. జాతర ప్రాంతంలో కొత్తగా బోరు మోటారులను ఏర్పాటు చేసి, పాడైన బోరు మోటారులను బాగుచేసి, నీటి సరఫరాపై ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టారు. పైపులైన్‌లను, ట్యాంకులను తనిఖీ చేసి, లీకేజీలను అరికట్టారు. నీటి వనరుల వద్ద పరిశుభ్రత పాటించి, క్లోరినేషన్ చేసి సురక్షితమైన నీటిని ప్రజలకు అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జాతర మహోత్సవాలకు గానూ గ్రామ సర్పంచ్ గజ్జి ఆంజనేయులు తీసుకుంటున్న ముందస్తు చర్యలకు స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గజ్జి ఆంజనేయులు, వార్డు మెంబర్ జల్ల, తిప్పయ్య, అధికారులు స్థానికులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా వార్డు సభలు

**మద్దూరు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రేపు (02.04.2026) గురువారం రోజున మద్దూరు మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో వార్డు సభలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్ తెలిపారు. ఈ సభల్లో అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ప్రజలు సభలకు హాజరై తమ సమస్యలను తెలియజేయాలని కోరారు.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**శ్రీరంగాపూర్, ఏప్రిల్1 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందజేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వనపర్తి శాసనసభ్యులు తూడి మెగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వనపర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని శ్రీరంగాపూర్‌మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 40 లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అందజేయడం జరిగింది. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే తుడిమేఘా రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లు .నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు

## షెడ్డు ఏర్పాటుకు హామీ

**దామరగిద్ద, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల కేంద్రంలోని జిపిఎస్ పాఠశాలను బుధవారం భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. రాజ్ కుమార్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఎండాకాలంలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం ఎండలో కూర్చొని తినాల్సి వస్తోందని వివరించారు. దీనికి పరిష్కారంగా షెడ్డు ఏర్పాటు చేయాలని కోరగా, వెంటనే స్పందించిన రాజ్ కుమార్ రెడ్డి షెడ్డు నిర్మాణం చేపడతామనిహామీ ఇచ్చారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీతకు టిన్ షెడ్డు ఏర్పాటుకు అవసరమైన కొటేషన్ సిద్ధం చేసి పనులు త్వరగా ప్రారంభించాలని సూచించారు. ఈ ఉపాధ్యాయ బృందం రాజ్ కుమార్ రెడ్డిని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంబరీష్, నాగేందర్, శశిధర్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## యువత ఆన్లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి : ఎస్సై హిమబిందు

**శ్రీరంగాపూర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** యువత క్రికెట్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసలై ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సులభంగా డబ్బు సంపాదించాలని అత్యాశతో అప్పులపాలై చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన పై నిరంతరం నిఘా ఉండాలని శ్రీరంగాపూర్ ఎస్సై హిమబిందు తెలియజేశారు. బుధవారం నగరాల ఫస్ట్ సెంటర్ నందు గ్రామ ప్రజలకు సైబర్ నేరాల పట్ల రోడ్డు భద్రత నియమాల పట్ల బాల్య వివాహాల పట్ల అవగాహన కల్పించడం జరిగింది. చట్ట ప్రకారం 18 సంవత్సరాల లోపు అమ్మాయికి 21 సంవత్సరాలలోపు అబ్బాయికి వివాహం చేయరాదని హెచ్చరించారు. యుక్త వయసు రాకముందే బాల్య దశలో చేసే ఈ వివాహాలు అమ్మాయి, అబ్బాయిల ఆరోగ్యం విద్య భవిష్యత్తుపై దీర్ఘకాలిక సమస్యలు వస్తాయని తెలియజేశారు.